
# తెలుగు సాహిత్య పునరుజ్జీవన ప్రదాత సి.పి. బ్రౌన్



## In 1825 I found Telugu literature dead, and in 30 years I rised it to life: సి.పి.బ్రౌన్

### సి. పి. బ్రౌన్ వర్ధంతి సందర్భంగా...

**ఉపోద్ఘాతం...**

పందొమ్మిదవ శతాబ్ది ప్రారంభం నాటికి జవజీవాలను కోల్పోయి, నిస్తేజంగా ఉన్న తెలుగు సాహిత్యానికి నూతన జవసత్వాలను కల్పించి పునర్వైభవాన్ని ప్రసాదించిన మహానుభావుడు సి.పి.బ్రౌన్. తెలుగు వాడు కాకపోయినా, తెలుగు నాడులో పుట్టకపోయినా తెలుగువారికంటే ఎక్కువగా తెలుగు భాషను ప్రేమించి, తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధిని కాంక్షించి, తెలుగు సాహిత్యాన్ని పునరుద్ధరించి వర్ధిల్ల జేసిన సి.పి.బ్రౌన్ 1798 నవంబర్ 17 వ తేదీన కలకత్తాలో ఆంగ్లేయులైన David Brown, Frances Cowley దంపతులకు జన్మించాడు. 1817 నుండి 1834 వరకూ, మళ్ళీ 1838 నుండి 1855 వరకూ (34 ఏళ్ళు) ఈస్ట్ ఇండియా కంపెనీ సివిల్ సర్వెంటుగా వివిధ హోదాలలో తెలుగు వారి మధ్య పనిచేసి తెలుగు భాషా సాహిత్యాలను నేర్చుకొని తెలుగు భాషకు వ్యాకరణాన్నీ, ఛందోగ్రంథాన్నీ ఆంగ్లంలో రాశాడు. తెలుగు వాచకాలను తయారు చేశాడు. తెలుగు ఇంగ్లీషు, ఇంగ్లీషు తెలుగు అనే బృహన్నిఘంటువులతో పాటు మిశ్రభాషా నిఘంటువూ, జిల్లా నిఘంటువూ అనే లఘు నిఘంటువులను కూర్చాడు. ఆనాటి తెలుగు భాషా సాహిత్య చరిత్రకు ఆకరాలనదగిన 20 సంపుటాల లేఖలనూ, అర్జీలనూ, పత్రికలనూ సేకరించి పదిలం చేశాడు. మెకంజీ సేకరించిన స్థానిక చరిత్ర ప్రతులను తిరగరాయించి భద్రం చేశాడు. ఈ స్థానిక చరిత్ర సంపుటాలను అధ్యయనం చేసి The Wars of Rajas, Cornatic Chronology, Memoirs of Hyder All and Tippo Sultan మొదలైన చరిత్ర గ్రంథాలను రాశాడు. బైబిలు, లూకా సువార్త మొదలైన క్రైస్తవ మత గ్రంథాలను తెలుగు పండితుల సహాయంతో తెలుగులోకి అనువదించాడు. వేమన పద్యాలనూ, సుమతి శతకాన్నీ, ఆంధ్రశబ్ద చింతామణినీ, అప్పకవీయాన్నీ (మూడు ఆశ్వాసాలు), కవిజనాశ్రయాన్నీ ఆంగ్లంలోకి అనువదించాడు. తెలుగు భాషా సాహిత్యాలపై వీరశైవ సాహిత్యాలపై వ్యాసాలు రాశాడు. అన్నికంటే ముఖ్యంగా కాల గర్భంలో కలసిపోతున్న వేలకొలది తాళపత్ర గ్రంథాలనూ, రాతప్రతులను సేకరించి, శుద్ధ ప్రతులు రాయించి, పండితులతో పరిష్కరింపజేసి, అచ్చువేయించి, వాటికి అమరత్వాన్ని ప్రసాదించాడు. 1855లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా పదవీ విరమణ చేసి, ఇంగ్లండుకు వెళ్ళిపోయాడు. అక్కడ కూడా తాను కూర్చిన నిఘంటువులకూ, వ్యాకరణానికీ, బైబిలు అనువాదాలకూ మార్పులూ చేర్పులూ చేస్తూ, లండను యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా, ఇండియన్ సివిల్ సర్వీస్ తెలుగు పరీక్షాధికారిగా తెలుగు భాషకు సేవ చేస్తూ 1884, డిసెంబరు 12న అమరుడయ్యాడు.

**వ్యాస పరిధి...**

**సి.పి.బ్రౌన్ చేసిన ఈ కృషినంతా కాలక్రమంలో కాకుండా విషయాన్ని బట్టి ఐదు వర్గాలుగా విభజించవచ్చు. అవి**

**1. తెలుగు భాషా బోధన/అభ్యసన ఉపకరణాలు...**
**1. వాచకాలు, 2. వ్యాకరణం, 3. నిఘంటువులు, 4. ఛందస్సు.**
**2. గ్రంథ పరిష్కరణ...**
**1. సేకరణ, 2. పాఠ పరిష్కరణ, 3. వ్యాఖ్యానాలు, 4. ముద్రణ**
**3. అనువాదాలు...**
**1. కావ్యానువాదాలు, 2. వ్యాకరణానువాదాలు, 3. బైబిలు అనువాదాలు**
**4. వ్యాసాలు**
**5. చరిత్ర గ్రంథాలు... 1. జీవిత చరిత్ర, 2. దేశ చరిత్ర**

బ్రౌన్ చేసిన ఈ అపారమైన కృషినంతా విపులంగా వివరించడం ఈ చిన్న వ్యాసంలో సాధ్యం కాదు కాబట్టి, పైన తెలిపిన మొదటి రెండు అంశాలకు మాత్రమే పరిమితమై ఆయా రచనల్లో, గ్రంథ పరిష్కరణలో ఆయన అనుసరించిన నూతన పోకడలనూ, శాస్త్రీయ విధానాలనూ రేఖామాత్రంగా వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**1. వాచకాలు**

ఆంగ్లేయులు తెలుగు నేర్చుకోవడం కోసం The Telugu Reader (1852) అనే వాచకాన్ని రాశాడు. ఈ వాచకంలో కావ్యభాషకు బదులుగా వాడుక భాషలో రాయబడిన లేఖలనూ, ఆర్జీలనూ, వాటి ఆంగ్లానువాదలనూ, వ్యాకరణ వివరణలనూ ఇచ్చాడు. దీనికి చివర ఒక లఘు నిఘంటువును అనుబంధంగా ఇచ్చాడు. ఈ వాచకమే గాక Vakyavali or Exercises: English and Telugu (1852), Dialogues in English for the use of learners with a grammatical analysis (1841) అనే వాచకాలను కూడా ఆయన రాశాడు. ఈ వాచకాల్లో వాడుక భాషకు ప్రాధాన్యమిచ్చి ఆనాడే వాడుక భాషా ఉద్యమానికి అంకురార్పణ చేశాడు. ఈ సందర్భంలో తెలుగు భాషా బోధన/ అభ్యసన విధానాల్లోని అశాస్త్రీయతపై వేరువేరు చోట్ల ఆయన వెలుబుచ్చిన అభిప్రాయాలను తెలిపి ఆయన తన వాచకాల ద్వారా ప్రవేశ పెట్టిన శాస్త్రీయ విద్యావిధానాన్ని చూద్దాం. విద్యార్థులను తెలుగు పండితులు సాధారణమైన సంభాషణలూ, కథలూ, లేఖలూ, ఆర్జీలకు బదులుగా భాగవతం, రామాయణం, మహాభారతంలోని కొన్ని ఆశ్వాసాలను చదవమంటారనీ, అమరకోశాన్నీ, ఆంధ్రభాషా భూషణాన్నీ, నన్నయ భట్టీయాన్నీ, అప్పకవీయాన్నీ, 'వల్లె' వేయమంటారనీ, దీనివల్ల విద్యార్థులు నిస్పృహకు గురవుతున్నారనీ ఆయన అన్నాడు. అంతేగాక హిందూ పండితులు చైనా వ్యాకర్తల్లాగా వాడుక భాషను నిర్లక్ష్యం చేసి అది విద్యార్థులకు తెలిసే ఉంటుందని కావ్యభాషను, సంస్కృతాన్ని బోధించడానికి ఇష్టపడతారు గాని, వాడుక భాషను చెప్పడానికి ఆసక్తి చూపరనీ, కింది మెట్టు ఎక్కకుండా పై మెట్టు ఎలా ఎక్కగలమనీ బ్రౌన్ ప్రశ్నించారు (Brown ... : ii-v). అందుకే తాను తక్కువ స్థాయి మాండలికం నుంచి ఎక్కువ స్థాయి మాండలికానికి విద్యార్థిని కొనిపోయే కొత్త వాచకాలను తయారు చేశానన్నాడు. (Brown..... : 60). ఆయనే మరోచోట పండితులు నన్ను ఛందస్సులో రాయబడిన పదజాలాన్ని భట్టీ పట్టమన్నారు. కానీ నేను తిరస్కరించాను. పాశ్చాత్య పద్ధతి అధ్యయనానికి ప్రాధాన్యం ఇచ్చానన్నాడు (Brown ... : 33).

**2.వ్యాకరణం...**

1840 లో బ్రౌన్ A Grammar of the Telugu Language అనే గ్రంథాన్ని ఆంగ్లంలో రాశాడు. దీన్ని 1857 లో రివైజ్ చేశాడు. ఆనాటికే బ్రౌన్ కు వ్యాకరణం ఎలా ఉండాలనే విషయంలో స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. ఆంగ్ల వ్యాకరణాలు లాటిన్ వ్యాకరణ పద్ధతిలో రాయబడినట్లుగా తెలుగు వ్యాకరణాలన్నీ సంస్కృత వ్యాకరణ పద్ధతిలో రాయబడ్డాయనీ, ఈ రెండు భాషలు పూర్తిగా వేరనీ దేశీయ పండితులకు "తెలుగు భాషకు తల్లి సంస్కృతమే" అనే మాట ఇష్టమనీ, కానీ ఇది తెలుగు భాష ఉత్పత్తికి సంబంధించినది కాదనీ, తెలుగు కేవలం సంస్కృతం మీద ఆధారపడిందనీ బ్రౌన్ అన్నారు. (Brown...... 1857: vi) తెలుగు వ్యాకరణాలు ఎలా ఉండాలో ఆయనే మరోచోట ఇలా చెప్పారు. It is to be hoped that a Telugu Grammar may eventuvally be written for the use of natives, in a plain and Intelligible manner free from the adherence to the Sanscrit system, and clear to the ordinary reader అన్నారు (Brown 182791). "ప్రయోగశరణం వ్యాకరణం" అనే ఉక్తికి అనుగుణంగా వ్యాకరణం ఉండాలన్నది ఆయన అభిప్రాయం. కొందరు తన వ్యాకరణాన్ని సులభీకరించమని కోరగా ఆయన "కవుల చేత మాత్రమే నూతన వ్యక్తీకరణలు సృష్టించబడతాయి, అవి కూడా అన్ని సందర్భాల్లో వ్యాప్తిలోకి రావు, కేవలం ఉన్నవాటికి పరిశీలించి నమోదు చేసి, కూర్చి, వాస్తవాలను వివరించడం, నా ప్రకటనలకు రుజువులు చూపించే కొటేషన్లు ఇవ్వడమే నా పని" అని అన్నాడు (Brown 1857: vi). దేశీయ వ్యాకర్తలు వాడుక భాషా పదాలను వ్యతిరేకిస్తారు. నిర్లక్ష్యం చేస్తారు. వాటిని గ్రామ్యం (Vulgar) భావిస్తారు. కానీ, గొప్ప చయితల రచనల్లో కూడా వాడుక మాటలు ఉంటాయి. కాబట్టి, వ్యాకరణంలో వాడుక భాషను కూడా పరిగణించాలనీ ఆయన అభిప్రాయపడ్డారు. బ్రౌన్ తన వ్యాకరణంలో చెప్పిన ఈ కింది విశేషాలను గమనించండి.

**1. కొన్ని సమాసాల్లో, సంయుక్త క్రియల్లోని పరుషాలు సరళాలుగా మారుతాయి (సరళాదేశం, గసడదవాదేశం).**
**కానీ, సరళాలు పరుషాలుగా మారవు.**
**2. స్త్రీ అనే పదాన్ని ఉచ్చరించేటప్పుడు ముందు పంక్తిలో ఉన్న హల్లును ఉచ్చరించాలి. తరువాత పంక్తి కింద ఉండే హల్లు / హల్లులను, ఆ తర్వాత పంక్తి పైన ఉండే అచ్చును ఉచ్చరించాలి.**
**3. సున్న మొదటి నాలుగు వర్గాక్షరాలకు పూర్వం వచ్చినపుడు 'న్' గా ఉచ్చరించబడుతుంది.**
**ఉదా: కింద, గ్రంథం, అంగం. చివరి వర్గాక్షరాలకు(పఫబభమ) పూర్వం వచ్చినపుడు 'న్' గా ఉచ్చరించబడుతుంది. ఉదా గంప అంబ. యకారానికి పూర్వం వచ్చినపుడు అర్ధానుస్వారం లాగా ఉచ్చరించబడుతుంది. ఉదా: సంయమి, సంయోగం.**
**4. దంద్య తాలవ్య చజలు సంస్కృత పదాల్లో రావు.**
**5. " ఎప్పుడూ ఒంటరిగా రాదు. 'జ' కిందనే వస్తుంది.**
**6. శకట రేఫ (ఱ), అరసున్న (ఁ) వ్యవహార భ్రష్టమయ్యాయి. వాటిని ఉపయోగించడం వృథా.**
**7. 'హ' కారం కొన్ని స్లార్లు 'ఫ'గా ఉచ్చరించబడుతుంది. ఉదా: జిహ్వ (jihva Pronounced jifva), కొన్ని సార్లు పదంలో హకారం స్థానమార్పిడి పొందుతుంది. ఉదా: బ్రహ్మ Brahma - Bramhaగా ఉచ్చరించబడుతుంది.**
**8. 'హ'కారంపై అచ్చులేనప్పుడు దాన్ని విసర్గ (ః)తో సూచిస్తారు. ఉదా: రామః (Ramah).**
**9. 'శ'కారం కేవలం సంస్కృత పదాలకు మాత్రమే పరిమితమైనది. తెలుగు పదాలనుండి దీన్ని తొలగించాలని, పండితులంటారు. కానీ ఈ విషయంలో ప్రజాభిప్రాయం ఇందుకు వ్యతిరేకంగా ఉంది. ఈ విషయంలో ప్రజల వాడుకే మార్గదర్శి. చేశి - చేసి, వ్రాశిన - వ్రాసిన (ఆ కాలంలో ఈ పదాల్లో శకారాన్ని ఉచ్చరించేవారని, బ్రౌన్ వాక్యాలను బట్టి మనకు తెలుస్తుంది.)**
**10.దుఃఖం (duhkam) దుఖం (dukham)గా ఉచ్చరించబడుతుంది.**

**నిఘంటువులు**

తెలుగు నాడులో బ్రౌన్కు బాగా పేరు తెచ్చి పెట్టినవి ఆయన కూర్చిన తెలుగు ఇంగ్లీషు (1852), ఇంగ్లీషు తెలుగు (1853), మిశ్ర భాషా నిఘంటువు (1854)ను తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులో భాగంగానే (అను బంధంగా) అనే ఆయన భావించాడు. జిల్లా నిఘంటువు (1854), ఆ తరువాత Wilson కూర్చిన Glossary of Judicial and Revenue Terms అనే నిఘంటువులో కల్సిపోయింది. బ్రౌన్ తాను కూర్చిన బృహన్ని ఘంటువులలో కొన్ని నూతన విషయాలు ప్రవేశపెట్టారు. ఆరోపాల ఎంపిక లోనూ, అర్థ వివరణలోనూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరించారు. ఆయన తన నిఘంటువులో ఎక్కడా కల్పిత పదాలనుగానీ, అర్థాలనుగానీ ఇవ్వలేదు. పదాలను సృష్టించడం తేలికే కానీ, ఏ విదేశీయుడికీ వాటికి వ్యాప్తిని కల్గించే శక్తి లేదు. భారతీయ భాషలను మార్చగలను, అభివృద్ధి చేయగలను అనే భ్రమ ఉన్నటువంటి వాణ్ణి కాను అని ఆయన అన్నారు (Brown 2000:x). హిందుస్తానీ, ఇంగ్లీషు లాంటి అన్యదేశ్యాలను ఇచ్చినా వాడుకలో లేని పదాలను ఆయన ఆరోపాలుగా ఇవ్వలేదు. కావ్యభాషలోని పదాలకు అర్థ వివరణలో కావ్య ప్రయోగాలను, విరివిగా ఇవ్వడం బ్రౌన్ ప్రవేశ పెట్టిన నూతన ఒరవడి. రెండువందల పై చిలుకు కవుల రచనల్లోంచి ఆయన కావ్య ప్రయోగాలు ఇచ్చారు. కొన్ని పదాల అర్థ వివరణకు సమకాలిక రచనల్లోంచి, నాటి పత్రికల్లోంచి కూడా ప్రమాణాలను ఇచ్చారు. (వీరభద్రరావు 1988: 346)

కొన్ని నిఘంటువుల్లో అర్థాలను వివరించడం కష్టమైన పదాలను వదిలేశారు. కానీ ఇలా వదిలేయడం పాఠకులకు అన్యాయం చేయడమే అని బ్రౌన్ అన్నాడు (Brown 2000: viii). కఠినమైన పదాలకు అర్థాలు తెలియ కపోతే ఆయన పండితులకు ఉత్తరాలు రాసి తెలుసుకునేవాడు. పండితులు చెప్పిన అర్థాలను కూడా గుడ్డిగా నమ్మేవారు కాదు. కొన్ని వృత్తిపదాల అర్థాల కోసం గ్రామాలకు వెళ్ళి, ఆయా వృత్తికారులను అడిగి తెలుసుకునేవాడు (బంగోరె 1977:...). కొన్ని పదాలకు సామెతల, చాటువుల సహాయంతో అర్థ నిర్ణయం చేసేవాడు. కొన్ని మొక్కల పేర్లను ఇతర నిఘంటువులలో లాగా 'ఒక వృక్ష విశేషము' అని కాకుండా నాటి శాస్త్రీయ నామాలను ఇచ్చాడు. ఆరోపాల ఎంపికకూ, అర్థ వివరణకూ ఇతర నిఘంటువులపై ఆధారపడినా ఎక్కువగా కావ్య పఠనం ద్వారానే సేకరించాడు. ఆసలు ఆయన నిఘంటువులే వేమన పద్యాలకు అర్థాలను వెతకడంతో ప్రారంభమయ్యాయి. బర్రె, గేదె, ఎనుము లాంటి మాండలిక భేదాలను కూడా బ్రౌన్ ఆనాడే సేకరించి తన నిఘంటువులో ఇచ్చాడు. తల్లి, తండ్రి అనే సామాన్య పదాలకు కూడా వ్యుత్పత్తిని చెప్పడం ఆయన సూక్ష్మ పరిశీలనకు నిదర్శనం (Brown 1999:v). జీవద్భాషలో మార్పులు సహజం అని గ్రహించినవాడు కాబట్టి ఆయన తన జీవితాంతం వాటిలో మార్పులూ, చేర్పులూ చేస్తూనే ఉన్నాడు. అన్నిటికంటే ముఖ్యమైనది తన రెండు బృహన్నిఘంటువులను పూర్తిగా ఆయన స్వదస్తూరితో రాశాడు. (బంగోరె 1977:66) ఛందస్సు వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదిస్తున్న తరుణంలో ఆ పద్యాల తాళపత్రాల్లో పాఠభేదాలు ఉండడం, కొన్ని పద్యపాదాలు శిథిలమైపోవడం, ప్రక్షిప్తాలుండడం, లేఖక దోషాలుండడం వంటి సమస్యలు The Prosody of the Telugu and Sanscrit Languages Explained (ఆంధ్ర గీర్వాణ ఛందము) అనే గ్రంథ రచనకు పురికొల్పాయి. ఛందోజ్ఞానంతో ఈ దోషాలను పరిష్కరించవచ్చనే ఉద్దేశంతో ఆయన ఈ గ్రంథం రాశాడు. 1827లో దీన్ని మొదటి సారి అచ్చువేయించాడు. ఈ గ్రంథంలో తెలుగు సంస్కృత ఛందస్సులను పోల్చి ఆయన తెలుగులో తులనాత్మక పరిశోధనకు ఆద్యుడయ్యాడు. (G.N. Reddy 1977:vi). తెలుగు - సంస్కృత ఛందస్సులను గ్రీకు లాటిన్ ఛందస్సులతో పోల్చి ఆయన బహుభాషా జ్ఞానాన్ని నిరూపించుకున్నాడు. సంస్కృతంలోని ద్వ్యక్షర గణాలనూ, త్ర్యక్షర గణాలనూ గ్రీకులోని ద్వ్యక్షర, త్ర్యక్షర గణాలతో పోల్చుతూ పట్టిక ఇచ్చాడు (Brown 1977:11). తెలుగులోని కందపద్యం, సంస్కృతంలోని ఆర్యాగీతి భేదమేనని తెలిపాడు.

**2. గ్రంథ పరిష్కరణ**

**1.గ్రంథ సేకరణ**

బ్రౌన్ 1825లో వేమన పద్యాలను చదివేటప్పుడు తెలుగులో ఒక ముద్రితప్రతిగానీ, శుద్ధప్రతిగానీ లేవు. ఉన్న తాళపత్రాలు కూడా నశించిపోయే స్థితిలో ఉన్నాయి. మనుచరిత్ర ఆరు ఆశ్వాసాల్లో మొదటి మూడు ఆశ్వాసాలు విరివిగా లభించాయి. కానీ చివరి మూడు ఆశ్వాసాల నాలుగు ప్రతులు సేకరించడానికి ఎంతో కష్టమైంది అన్నారాయన (Brown 1978: 78). బ్రాహ్మణులు తమ గ్రంథాలను ఇతరులకు ఇవ్వడానికి ఇష్టపడేవారు కాదు. కానీ, మర్యాద పూర్వకంగా అడిగి సేకరించేవాడిని. అది ఎంత పవిత్రమైనదైనా, ఎంత రహస్యమైనదైనా. వాళ్ళదగ్గర డబ్బు పనిచే యదు. కానీ చెప్పిన సమయానికి తిరిగి ఇచ్చేట్లయితే తమ గ్రంథాలు ఇచ్చే వారు. ఆకాలంలో గ్రంథాలు ఎక్కువగా రాజులూ, జమిందార్లూ, దుబాసీలూ, కరణాలూ, వకీళ్ళూ మొదలైన గొప్పవాళ్ళ ఇళ్ళల్లో ఉండేవి. వాళ్ళ వివరాలను సేకరించి వాళ్ళ వద్ద నుంచి మిత్రుల ద్వారా వాటిని సంపాదించేవాడు. కంపెనీ ఉద్యోగులకు లేఖలు రాసి తెప్పించుకునేవారు. మచిలీపట్నంలో ఒక గృహిణి అమ్మజూపిన గ్రంథాలను అప్పట్లోనే 370 రూపాయలు ఇచ్చి కొన్నారు. అలాగే రాజమండ్రిలోని ఒక న్యాయవాది గ్రంథాలయాన్ని మొత్తం కొన్నాడట (ఇంకా వివరాలకు చూ. ఆరుద్ర 1990:172-177. పద్మావతి 1986: 28, 29). ఆరోజుల్లోనే 30,000 రూపాయల సొంత డబ్బును ఖర్చు పెట్టి సేకరించిన 2440 తాళపత్ర గ్రంథాలనూ, రాతప్రతులనూ 1855లో ఇంగ్లండుకు వెళ్ళేముందు మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారానికి దానం చేశాడు. అలాగే తాను సేకరించిన 20 సంపుటాల లేఖలనూ, అర్జీలనూ, పత్రికలనూ కూడా ఆ భాండాగారానికి దానం చేశాడు. (బ్రౌన్ సేకరించిన ఈ లేఖలూ, అర్జీలూ, పత్రికలూ తెలుగు భాష, సాహిత్య చరిత్ర పరిశోధనకు గనులు. ఈ గనుల్లోంచి బంగోరె బ్రౌన్ జాబులు: తెలుగు జర్నలిజం చరిత్ర (1973), బ్రౌను జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు: కడప జాబుల సంకలనం (1977 డిసెంబర్), బ్రౌన్ లేఖలు ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర శకలాలు అనే రత్నాలను వెలికి తీశారు. ఇంకా ఎన్నో రత్నాలను వీటినుంచి వెలికి తీయవచ్చు.)

**పాఠ పరిష్కరణ...**

బ్రౌన్ సేకరించిన తాళపత్రాల్లో శిథిల భాగాలూ, ప్రక్షిప్తాలూ, పాఠ భేదాలూ, లేఖక దోషాలూ ఉండేవి. రాయసగాళ్ళను నియమించి మొదట తాళపత్రాలను తెల్లకాగితాలపై ఎత్తిరాయించేవాడు. ఎప్పుడూ పది నుండి ఇరవై మందికి తగ్గకుండా తెలుగు పండితులకు జీతాలిచ్చి, వారిచేత పాఠ భేదాలను పరిష్కరింపచేసి శుద్ధ ప్రతిని తయారు చేయించేవారు. మొదట్లో ఈ పండితులు పాఠంలోని లోపాలను తమకు తోచిన విధంగా దిద్దేవారు. కానీ, బ్రౌన్ Lambinus, Erasmus, Heinsius, Casaubon, Kennicott మొదలైన పండితుల పాఠ పరిష్కరణ పద్ధతిని చదివి ఆ పద్ధతుల్లో తెలుగు గ్రంథాలను పరిష్కరింపచేశాడు. ఇటలీ, జర్మనీ దేశీయుల గ్రంథ పరిష్కరణ పద్ధతిని ఆయన తెలుగులో తొలిసారిగా ప్రవేశ పెట్టారు. నేటికీ గ్రంథ పరిష్కరణలో ఆయన పద్ధతులనే తెలుగువారు అనుసరించడం విశేషం.

**వ్యాఖ్యానాలు...**

'పాఠ పరిష్కరణ సమయంలో పదాలకు గానీ, పద్యానికి గానీ అర్థ నిర్ణయంలో సందేహం వస్తే అక్కడి పండితుల మధ్య చర్చ జరిగేది. అట్లా జరిగిన చర్చనంతా బ్రౌన్ రికార్డ్ చేయించేవాడు. ఈ రికార్డులే వ్యాఖ్యానాలకు దారితీశాయి. సంస్కృత కావ్యాలను చదవడానికి వ్యాఖ్యానాలు లభించేవి. కాని ఆయనకు తెలుగులో రెండు మాత్రమే లభించాయి. ఇవి పాఠకునికి ఉపయోగపడడం కంటే వ్యాఖ్యాత పాండిత్యాన్ని ప్రదర్శించడానికే ఎక్కువ ఉపయోగపడే విధంగా ఉన్నాయి (Brown 1978:39) అని బ్రౌన్ పేర్కొన్నారు. ఇట్లా పండితులకే పరిమితమైన తెలుగు కావ్యాలు పామరులకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వాటికి ఆయన వాడుక భాషలో వ్యాఖ్యానాలు రాయించాడు. వసుచరిత్రకు ముందుగా ములుపాక బుచ్చయ్య శాస్త్రిచేత వ్యాఖ్యానాలు రాయించిన బ్రౌన్, అది కఠినంగా ఉందని భావించి, మళ్ళీ జూలూరి అప్పయ్య చేత సులభమైన వ్యావహారిక భాషలో వ్యాఖ్యానం రాయించాడు. ఇది ఆయన వాడుక భాషకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనం. మనుచరిత్ర, కళాపూర్ణోదయం, ఆముక్త మాల్యద, కవికర్ణ రసాయనం, రాఘవ పాండవీయం, విజయ విలాసం మొదలైన కావ్యాలకు ఆయన వ్యాఖ్యానాలు రాయించాడు. (ఇంకా వివరాలకు చూ. ఆరుద్ర 1990: అనుబంధం.)

**ముద్రణ...**

సి.పి. బ్రౌన్ కంటే ముందు విలియం బ్రౌన్, కాంబెల్ మొదలైనవారి గ్రంథాలు అచ్చయినప్పటికీ తెలుగు నాడులో ముద్రణను అభివృద్ధి చేసిన ఘనత బ్రౌన్దే. తెలుగులో అచ్చయిన మొట్టమొదటి కావ్యం ఆయన అనువదించిన వేమన పద్యాలు (The Verses of Vemana). ఇది 1829లో అచ్చయింది. అంతకు పూర్వం తాళపత్రాల్లో పదాలన్నీ గొలుసు కట్టు లాగా ఉండేవి. పాదాల మధ్య / వాక్యాల మధ్య చోటు ఉండేది కాదు. విరామ చిహ్నాలు ఉండేవి కావు. పద్య సంఖ్య గానీ, ఆశ్వాస విభజన గానీ, అవతారికా విభాగం గానీ ఉండేవి కావు. 1827లో బ్రౌన్ ప్రచురించిన ఆంధ్ర గీర్వాణ ఛందంలో ఆయన మొదటి సారిగా పద్యానికి పాద విభజన చేసి, నక్షత్రపు గుర్తుతో యతిస్థానాన్ని సూచించి అచ్చు వేశారు. వేమన పద్యాల గ్రంథంలో పద్య సంఖ్య వేసి ప్రచురించారు. ఆ తర్వాత ప్రచురించిన ఆంధ్ర మహాభారతాది గ్రంథాల్లో ఆశ్వాస విభజన, కథా సంగ్రహం, ఉపాఖ్యానాల పేర్లు, మొదలైన ముద్రణా పద్ధతులను ఆయన వెలుగులోకి తెచ్చారు. ముద్రణలో హల్లుల కింద రాసే 'క్రావడి'ని ముద్రించడం కష్టంగా ఉండడం వల్ల దానికి బదులుగా అనే గుర్తును ఆయన ప్రవేశపెట్టాడు. ఈ గుర్తునే ఆనాడు 'బ్రౌన్ రకారం' అనేవారు (వీరభద్రరావు 1986 :). పుస్తక ప్రచురణ విరివిగా జరిగితే తప్ప తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందదని భావించిన బ్రౌన్ ముద్రాపకులను ప్రోత్సహించాడు. కొన్ని వేల రూపాయలు ఖర్చు చేసి సేకరించి పరిష్కరింపజేసి తయారు చేసిన శుద్ధ ప్రతులను ముద్రాపకులకు ఉచితంగా ఇచ్చి, తాను నష్టపోయినా, తెలుగు కావ్యాలు విరివిగా అచ్చు కావడం చూసి ".. I lost the sum I expended: but I looked for this result and was satisfied (Brown 1978: 62) అని సంతోషించిన మహానుభావుడు బ్రౌన్. కొత్తపల్లి వీరభద్రరావు గారు అన్నట్లు 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు అనే గీతావాక్యానికింత కంటే మంచి ఉదాహరణ ఎక్కడ లభించును? (వీరభద్రరావు 1988:158). విదేశీయుడైనా తెలుగు భాషకు ఇంత నిస్వార్థంగా సేవ చేసిన బ్రౌన్ ఋణం ఎలా తీర్చుకోవాలి? వర్తమాన తరంగిణిలో ఆ పత్రికా సంపాదకుడు చెప్పినట్లు "...యీ మహోపకారుని మనమున్నూ మన కుటుంబాల వారున్నూ అహోరాత్రముల యందు సువిశేషమైన వాక్యముల చేత తలంచుచుండవలెను" (బంగోరె 1973:101), అంతకంటే ముఖ్యమైనది జి.ఎన్. రెడ్డిగారు చెప్పిన ఈ కింది మాట: The best tribut that the Telugu people could pay Brown and a fitting memorial that they could think of raising for him is to continue the great fredition he established and to carry on research along the avenues he opend up in the Telugu studies (G.N. Reddy 1977: )

**ఉపయుక్త గ్రంథాలు:**

**బంగోరె. అక్టోబర్, 1973. బ్రౌన్ జాబులు: తెలుగు జర్నలిజం చరిత్ర(1835 నుంచి 1857 వరకు). నెల్లూరు: బంగోరె**
**బంగోరె. డిసెంబర్, 1977. బ్రౌను జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు : కడప జాబుల సంకలనం. తిరుపతి: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం.**
**Brown, Charless philip. 1981. Second edition A Grammar of The Telugu Language. New Delhi: Asian Educational Series.**
**పద్మావతి, ఆర్. మే, 1986. బ్రౌను - తెలుగు కావ్య సముద్ధరణము. తిరుపతి: నవ్య పరిశోధన ప్రచురణ.**

**డా. బాణాల భుజంగ రెడ్డి**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500046
సెల్: 72178 72141



# ఎన్నికల సంస్కరణలపై చిత్తశుద్ధిలేని చర్చ

పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ కాస్తా అసలు విషయాలను పక్కదారి పట్టించేలా ఉంది. అధికార బిజెపి లేదా ఎన్‌డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. ఇంటాబయటా ఆయన అదే పాట పాడుతున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. ఎన్నికల సంస్కరణలపై చరచ అంటూ తమ అనుకూలంగా లేని విషయాలపై పార్లమెంటులో చర్చిస్తున్నారు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. దీనికోసమే అందరి ఆరాటంగా ఉంది. ఇందులో ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలుగా మారుతున్నారు. అసలు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శానసభల కు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే అవకాశం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్దత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై రాజీవ్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, లెఫ్ట్ పార్టీలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నాయో చెప్పాలి. నిజమైన ఓటర్లే జాబితాలో ఉండాలనే దానిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో జాతికి తెలియ చేయాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసన సభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని చెబుతున్న మాటల్లో కూడా నిజం లేదు. ప్రజలు తక్కువ అంచనా వేయడం సరికాదు. ఓటుహక్కు నిరాకరణకు గురైనవారిలో ఎవరున్నా వారి పేర్లు బయటపెట్టి చూపగలగాలి. అలా చేయకుండా సర్ ప్రక్రియను వ్యతిరేకించడం సరికాదు. పార్లమెంటులో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ తలాతోకా లేకుండా సాగింది. ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు. అలాంటి సమయంలో దొంగ ఓటర్లంతా ఓటేస్తే..తద్వారా ఎన్నికైన వారంతా ప్రజా ప్రతినిధులు ఎలా అవుతార్నదే ప్రశ్న. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ ప్రధానంగా చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకులు, విపక్షాలు కలసి తమకు అనుకూలంగా ఉండే విషయాలనే ప్రస్తావిస్తున్నారు. దానిపైనే చర్చిస్తున్నారు. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ఎన్నికలలో అక్రమాలు భారత్‌కే పరిమితం కాలేదు. ఎన్నికల నిర్వహణ అమలు చేస్తున్న అన్ని దేశాల్లో ఈ జాడ్యం ఉంది. ఉన్న నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నది. నియంతలు తమ ఇష్టారాజ్యంగా ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూనే వస్తున్నారు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపడానికి దొంగ ఓట్లతో సాయం పొందుతున్నారు. రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఎన్నికల నియమాలు పూర్తిగా తమకు అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. అందువల్ల మొదట నియమ నిబంధనలు మార్చాల్సి ఉంది. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది. జాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిరంకుశత్వం వైపు మళ్లించకుండా అడ్డుకోగలుగుతాం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నాయకులకు కాల పరిమితి ఉంటే అవినీతికి అంతగా ఆస్కారం ఉండదు. అందువల్ల ఎన్నికల సంస్కరణల ఆవశ్యకతను గుర్తించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయాలి. అంతేగాకుండా ఓటు వేయమన్నది బాధ్యత కూడా కావాలి. కావాలని ఓటేయని వారినిశిక్షించే పరిస్థితి కూడా ఉండాలి. ఇవన్నీ సాధ్యమైతేనే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడగలదు.

